


RNI No. APTEL/2008/24928
Postal Registration No. : VZM/22/2020-2022

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY




PUBLISHED BY : VIZIANAGARAM, VISAKHAPATNAM, SRIKAKULAM, PARVATHIPURAM MANYAM, ANAKAPALLI, GUNTUR, VIJAYAWADA, EAST & WEST GODAVARI, TIRUPATHI, TELANGANA

విజయనగరం | సంపుటి : 15 | సంచిక : 309 | శనివారం 21 డిసెంబర్ 2024 | ఎడిటర్ : మజ్జి శివ కుమార్.. | పేజీలు : 04 | వెల : రూ. 2/-

## ఓర్వకల్లులో రూ.14వేల కోట్ల పెట్టుబడులు..

### – ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మంత్రి టి.జి భరత్



కర్నూలు : కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ. 14 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ మరియు ఇండియాకు చెందిన కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. అమరావతిలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కంపెనీ ప్రతినిధులు సమావేశమైనట్లు మంత్రి భరత్ తెలిపారు. రాయలసీమలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని సమావేశంలో పెట్టుబడిదారులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. చర్చల అనంతరం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ. 14వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ప్రతినిధులు ముందుకొచ్చారన్నారు. జనవరి రెండవ వారంలో సీఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీతో ఎంవోయూ చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ దూరదృష్టితోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పారిశ్రామిక అభివృద్ధిని పెంచడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు వస్తాయన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమవుతుందని మంత్రి టి.జి భరత్ చెప్పారు. ఆవిష్కరణలు మరియు పురోగతికి కేంద్రంగా కర్నూలు జిల్లా మారబోతుందని మంత్రి టి.జి భరత్ తెలిపారు.


## మరో 24 గంటల్లో ఏపీలోని ఆరు జిల్లాలో భారీ వర్షాలు..

### – వాతావరణశాఖ హెచ్చరిక



అమరావతి : రానున్న 24 గంటల్లో ఏపీలోని ఆరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం 12 గంటల్లో ఉత్తరం వైపు కదులుతూ వాయుగుండంగా బలపడే అవకాశముందని అధికారులు వెల్లడించారు.రానున్న 24 గంటల్లో ఉత్తర ఈశాన్య దిశగా వాయుగుండంగా కదిలి , ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కాకినాడ అల్లూరి, అనకాపల్లి, విశాఖ , మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు భారీ వర్షాలు పడుతాయని స్పష్టం చేసింది. తీరం వెంబడి గంటకు 40-50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని, మరో రెండు రోజులు మత్స్యకారుల చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. కళింగపట్నం-మచిలీపట్నం వరకు అన్ని పోర్టుల్లో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు వివరించారు.

# ఎకనమిక్ హబ్‌గా ఏపీ రాజధాని..



- అమరావతి అభివృద్ధికి 800 మిలియన్ డాలర్ల ప్రపంచ బ్యాంకు రుణం..!
- 'అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్' కింద రుణం
- ప్రస్తుత, భవిష్యత్ పౌరుల స్థితిగతులు మెరుగు పర్చడంతోపాటు ఉపాధి కల్పన..
- అత్యంత అవసరమైన వారితోపాటు పౌరులందరి జీవన స్థితిగతులు మెరుగు పర్చి, ఉద్యోగాలు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నగర అభివృద్ధికి రుణం ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు అంగీకరించింది. అలాగే అమరావతిని ప్రధాన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 800 మిలియన్ డాలర్ల రుణం మంజూరు చేసినట్లు ప్రపంచ బ్యాంకు వర్గాలు తెలిపాయి. ప్రపంచ బ్యాంకు బోర్డు డైరెక్టర్ల సమావేశంలో 'అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్' కింద 800 మిలియన్ డాలర్ల రుణం మంజూరు చేయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పర్యావరణ హిత అభివృద్ధి కేంద్రంగా అమరావతిని రూపుదిద్దుతారు. ప్రస్తుత, భవిష్యత్ పౌరుల స్థితిగతులు మెరుగు పర్చడంతోపాటు ఉపాధి కల్పనకు ఈ రుణం వినియోగిస్తారని ప్రపంచ బ్యాంకు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఎకనమిక్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి రుణం మంజూరు చేయాలని భారత ప్రభుత్వం కోరిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. అత్యంత అవసరమైన వారితోపాటు పౌరులందరి జీవన స్థితిగతులు మెరుగు పర్చి, ఉద్యోగాలు కల్పించేందుకు వీలుగా అమరావతిని మోడర్న్ సిటీగా రూపుదిద్దాలని భారత్ కోరిందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 29 ఏండ్లలో ఈ రుణం చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా ఆరేండ్లు గ్రేస్ పీరియడ్ ఉంటుంది.

## జేపీసీకి జమిలి బిల్లు.. లోక్‌సభలో తీర్మానం ఆమోదం



న్యూఢిల్లీ: ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై రూపొందిన జమిలి బిల్లును పార్లమెంటరీ స్థాయి సంఘానికి పంపాలని ఇవాళ లోక్‌సభ తీర్మానం పాస్ చేసింది. సభను నిరవధికంగా వాయిదా వేయడానికి ముందు రెండు బిల్లులను జేపీసీకి పంపేందుకు తీర్మానాన్ని లోక్‌సభ ఆమోదించింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే రెండు రోజుల క్రితం జమిలి ఎన్నికల బిల్లుకు లోక్‌సభలో ఆమోదం దక్కిన విషయం తెలిసిందే. అయితే పార్లమెంటరీ స్థాయి సంఘంలో ఉండే సభ్యుల వివరాలను పంపించాలని రాజ్యసభను మంత్రి కోరారు.సంయుక్త పార్లమెంటరీ స్థాయి సంఘం కమిటీలో మొత్తం 39 మంది ఎంపీలు ఉంటారు. దాంట్లో 27 మంది లోక్‌సభ, 12 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పీపీ చౌదరీ, ప్రియాంకా గాంధీలు లోక్‌సభ నుంచి ఆ కమిటీలో ఉన్నారు. జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు బిల్లులపై జేపీసీలో చర్చిస్తారు. ఓ బిల్లు కోసం మాత్రం రాజ్యాంగ సవరణ అవసరమని నిపుణులు చెబుతున్నారు.

## పేదలందరికీ ఇళ్లు.. ఎడ్యుకేషనల్ హబ్‌గా కుప్పం

### – నారా భువనేశ్వరి.



చిత్తూరు జిల్లా: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చిత్తూరు జిల్లాలోని కుప్పంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆమె పర్యటన కొనసాగుతోంది. వనగుట్టపల్లిలో రచ్చబండ వద్ద మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నా క్యాంటీన్లతో పేదలకు అన్నం పెడుతున్నామని, పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని, కుప్పాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తామని నారా భువనేశ్వరి అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ హయంలో రాష్ట్రంలో ఇండస్ట్రీలు భయపడి అన్నీ వెనక్కి వెళ్ళిపోయాయని, చంద్రబాబు నాయుడు సీఎం అయిన తర్వాత ఇప్పుడిప్పుడే పరిశ్రమలు వస్తున్నాయని నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఎన్నో సేవా కార్యక్రమం చేస్తున్నామని, నిరుపేద కుటుంబాలకు విద్యార్థులకు ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున ఆర్థికంగా సహాయ సాకారం అందిస్తున్నామని తెలిపారు. కుప్పం అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు రోడ్లు, వీధి దీపాలు, కాలువలు నూరు శాతం పూర్తి చేస్తారని తెలిపారు.

## ఫార్ములా- ఈ కార్ రేసు.. హైకోర్టు సంచలన తీర్పు..

హైదరాబాద్: ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు భారీ ఊరట లభించింది. వారం రోజుల వరకూ కేటీఆర్‌ను అరెస్టు చేయ్యొద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఏసీబీ తన దర్యాప్తును కొనసాగించవచ్చని హైకోర్టు తెలిపింది. ఈనెల 30 లోగా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఈనెల 27కి వాయిదా వేస్తూ తీర్పు. వెలువరించింది , ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో ఏబీసీ తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్.. హైకోర్టులో నేడు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం ఇరువర్గాల వాదనలు వినింది. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం, తెలంగాణ ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో కేటీఆర్ ఎక్కడా లబ్ధి పొందలేదని న్యాయస్థానానికి సుందరం తెలిపారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఏసీబీ కేసు నమోదు చేసిందని, ఏసీబీ నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి అసలు ఆధారాలే లేవని చెప్పారు. కేటీఆర్ లబ్ధి చేకూరినట్లు ఎక్కడా నిరూపితం కాలేదని చెప్పారు.



# సంపాదకీయం

## ఈ విజన్‌తో ఉజ్వలభవితకు భరోసా!

ఒక కుటుంబ పెద్ద తన ఇంటిని కనిపెడుతూ, ఆ ఇంటిసభ్యుల అవసరాలను తీరుస్తూ, కుటుంబాన్ని ఏ విధంగా నడిపిస్తుంటాడో అదే విధంగా ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌ను నారా చంద్రబాబు నాయుడు ముందుకు నడిపిస్తున్నారు. ఎన్నో రంగాల్లో దేశంలోనే ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. అభివృద్ధి పట్ల చంద్రబాబుకు ఉన్న విజన్ అనతికాలంలోనే రాష్ట్రాన్ని ప్రగతిపథంలో దూసుకుపోయేలా చేస్తున్నది. నిత్యం ప్రజల కోసం, భావితరాల కోసం ఓ యోధుడిలా పని చేయడం చంద్రబాబు విధానం. అయిదేళ్ల పదవి కాలంలో ఏమి చేస్తాంలే అన్నట్టు అప్పటి ముఖ్యమంత్రుల విధానాలు ఉండేవి. కానీ చంద్రబాబు మాత్రం 20 ఏళ్ల కాలానికి దర్శనికత చూపారు. 1998లో విజన్ 2020 అంటే అప్పటి ప్రతిపక్ష నాయకులు హేళన చేశారు. కానీ దాని ఫలితాలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలూ అనుభవిస్తున్నారు. దేశంలో విజన్ కార్యక్రమాలకు నాంది పలికింది చంద్రబాబు. జగన్ అయిదేళ్లపాటు అరాచకాలతో, అక్రమాలతో రాష్ట్రాన్ని నాశనం చేస్తే, గాడి తప్పిన రాష్ట్రానికి ఊపిరి పోయడానికి సీఎం చంద్రబాబు విజన్ -2047ని తీసుకొచ్చారు. ముఖ్యంగా రాష్ట్రంలో దళితులు, వెనకబడిన కులాలకు ఉపయోగపడే విధంగా విజన్ 2047ను రూపొందించారు. దీని ముఖ్య ఉద్దేశం పేదరికాన్ని నిర్మూలించి అభివృద్ధిపథంలో నడపడం. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రజలు అందరూ పేదరికం నుంచి భయటపడి సంపన్నులు కావాలనేది విజన్ 2047లోని మొదటి అంశం. -ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంతో అట్టడుగు వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేయటం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్న దానికి అనుగుణంగా కార్యాచరణ త్వరలో ప్రవేశపెట్టనున్నారు. దీంతో ప్రస్తుతం కుటుంబం తలసరి ఆదాయం రూ.2.70 లక్షలు ఉంటే 2047 నాటికి రూ.36 లక్షలకు పెరుగుతుంది. రాష్ట్రం విడిపోయిన తరువాత ఏపీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు తక్కువయ్యాయి. జగన్ అయిదేళ్ల పాలనలో ఉద్యోగా లిస్తామని నమ్మబలికి విద్యార్థులను మోసం చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ ఉద్యోగం కల్పించాలని సంకల్పించింది. దాని కోసం ప్రత్యేక స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. 2014లో టీడీపీ హయాంలో హెచ్‌సీఎల్, గన్నవరం ఐటీ పార్కులో ఉద్యోగాలు కల్పించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత టీసీఎస్, గూగుల్ వంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను నిరుద్యోగులు లేని రాష్ట్రంగా తీర్చుద్దిదాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. విజన్ 2020లో భాగంగా గోదావరి, కృష్ణా నదులు అనుసంధానం చేసి వేలాది ఎకరాలకు నీరు అందిస్తున్నారు. ఇప్పుడు ఈ విజన్ 2047తో త్వరలో రాయలసీమ వరకు నదులు అనుసంధానం చేసి నీటి కొరతను తీర్చుడాన్ని ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ మన రాష్ట్రంలో నీరు అందని గ్రామాలు చాలా ఉన్నాయి. 2047 నాటికి ప్రతి గ్రామానికీ నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. విజన్ 2020లో డ్రిప్ పద్ధతిని పరిచయం చేసినప్పుడు అందరూ ఏంటో అనుకున్నారు. ఇప్పుడు ఆ డ్రిప్ పద్ధతి లేనిదే ప్రధాన పంటలు సాగు కావడం లేదు. విజన్ 2047లో కూడా అలాంటి అధునాతన సాంకేతికత పద్ధతులను రైతులకు పరిచయం చేసి లాభసాటిగా మార్చాలని నిర్ణయించారు. పంటకోత అనంతరం నష్టాలు తగ్గించేందుకు ఏఐ, ఐఓటీ, రోబోటిక్స్, డ్రోన్ల వినియోగం పెరగాలని విజన్ 2047 సూచించింది. చిన్న రైతులకు డిజిటల్ సేవలు, మైక్రో క్రెడిట్ సౌకర్యాలు, పంటల బీమా, రియల్ టైమ్ రాయితీలను అందించనున్నారు. దీంతో రైతు లాభదాయకంగా మారడానికి అవకాశాలు ఉంటాయి. రానున్న కాలంలో దేశ రవాణా మొత్తం లాజిస్టిక్స్ మీద ఆధారపడి ఉంటుంది. ఈ రంగంలో యువతకు ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. పారిశ్రామిక రంగంలో చంద్రబాబు వాగ్దానాలను ఒక్కొక్కటే నెరవేరుస్తూ వస్తున్నారు. పరిశ్రమల స్థాపనలో పాలనాపరమైన అడ్డంకులను అధిగమించి కేవలం 15 రోజుల్లో కొత్త పరిశ్రమలకు అనుమతులు లభించేలా చట్టాన్ని తెచ్చారు. ఈ విషయంలో దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచారు. ప్రస్తుత దేశ జీడీపీలో 14 శాతం రవాణాకే ఖర్చవుతున్నది. దీనిని తగ్గించి, రహదారులు నిర్మించి, జలరవాణాను ఉపయోగించుకొని, తద్వారా రవాణ వ్యయం తగ్గించి ప్రపంచస్థాయి లాజిస్టిక్స్‌లో ఏపీకి ప్రత్యేక స్థానాన్ని కల్పించనున్నారు. విజన్ 2020 ప్రవేశపెట్టక ముందు రాష్ట్రంలో కరెంట్ కష్టాలు ఎక్కువగా ఉండేవి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఏపీలో 5 వేల మెగావాట్లు విద్యుత్తు ఉత్పత్తి అయితే చంద్రబాబు 2004 పదవి అయిపోయే నాటికి 10వేల మెగావాట్లు విద్యుత్తును ఉత్పత్తి చేశారు. దీంతో రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వగలిగారు. ప్రస్తుత విద్యుత్తు కొనుగోలు ధర యూనిట్‌కు రూ.5.19 ఉండగా, ఈ ఏడాది దానిని రూ. 4.80 తగ్గించారు. రానున్న కాలంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా రాష్ట్రాన్ని నిలిపేందుకు కృషి చేస్తారు .

# పార్వతీపురం గిరిజన ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి సుడిగాలి పర్యటన..

- గిరిజన ప్రాంతాల రహదారి పనులు నిర్మాణం కోసం 19 రోడ్లు నిమిత్తం 46 కోట్లు మంజూరు..
- ప్రతి గిరిజన గ్రామానికి రహదారులు నిర్మించడమే చంద్రబాబునాయుడులక్ష్యం.
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్.






ప్రజాస్వామ్యం న్యూస్. సాలూరు/జియ్యమ్మవలస : పార్వతీపురం, డిసెంబర్ 20 : పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం కవిరిపల్లి గ్రామం లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గిరిజన గ్రామాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ సందర్శించాలని ఆయన నిర్ణయించారు. జోరు వానలోనూ పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఉప ముఖ్యమంత్రి పర్యటన సాగింది.గిరిజన గ్రామాల్లో ఆయన కాలి నడకన పర్యటిస్తూ అక్కడ స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గిరిజన గ్రామాల్లో అంతర్గత రహదారులను ఆయన ఈ సందర్భంగా రహదారులు నిమిత్తము. 19 రహదారుల నిర్మాణం కోసం 46 కోట్లు నిధులతో శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. అలాగే మక్కువ మండలం, కవిరిపల్లి గ్రామం ప్రారంభం నుంచి చివర వరకు నడిచారు. చీపురు వలస సమీపంలోని వెంగళరాయసాగర్ వ్యూ పాయింట్ వద్ద ఆగి ప్రకృతి అందాలను తిలకించారు. కొండలు జలపాతాలను స్వయంగా మొబైల్ లో బంధించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, సిద్దవటంతోపాటు ఇక్కడ అడ్వంచర్ టూరిజం అభివృద్ధి చేయాలని.. ఇందుకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖకు తెలియచేయాలని అధికారులకి సూచించారు. శంబర గ్రామంలో శ్రీ పోలమాంబ ఆలయం వద్ద పనికి ఆహార పథకం నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రోడ్డు క్వాలిటీ, నిర్మాణ వ్యయం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.కొత్త రోడ్డును తన మొబైల్ లో వీడియో తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు.రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి .కురుపాం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం, పాలకొండ, నెల్లిమర్ల శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, లోకం మాధవి, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక,సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తిరుమలలో భక్తులను మోసగించిన ఐటీబీపీ కానిస్టేబుల్‌పై కేసు నమోదు



తిరుమల : ఆపదమొక్కులవాడు తిరుమల వేంకటేశ్వరుడిపై ఉన్న నమ్మకంతో భక్తుల బలహీనతను ఆసరాగా చేసుకుని మోసం చేసిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీవారి బ్రేక్ దర్శనాలు కల్పిస్తానని ఐటీబీపీ కానిస్టేబుల్ చంద్రశేఖర్ బెంగుళూరుకు చెందిన హరిబాబు, చంద్రశేఖర్‌ను బురిడీ కొట్టించాడు. అనంతపురం ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సిఫార్సులేఖపై ఆరు టికెట్లకు గాను రూ.50 వేలు, అరకు ఎమ్మెల్యే మచ్చలింగం సిఫార్సు లేఖపై 20 వేలను కానిస్టేబుల్ వసూలు చేశాడు. అయితే బ్రేక్ దర్శనం కాకుండా రూ. 300 టికెట్ దర్శనం కల్పించడంతో మోసపోయామని గ్రహించిన భక్తులు టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుమల పోలీసులు ఐటీబీపీ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జైలు నుంచి పరిటాల రవి హత్య కేసు నిందితుల విడుదల




అమరావతి : మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరిటాల రవి హత్యకేసులో నిందితులు శుక్రవారం జైలు నుంచి విడుదలయ్యారు. నిందితులకు శిక్ష పడి 18 ఏళ్లుగా కడప సెంట్రల్ జైలులో ఉన్నారు. నిందితులు హైకోర్టులో పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై జరిగిన విచారణ అనంతరం హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో నిందితులైన పండు నారాయణ రెడ్డి, రేఖమయ్య, రంగనాయకులు వడ్డే కొండ, ఓబిరెడ్డి జైలు నుంచి విడుదలయిన వారిలో ఉన్నారు. వీరంతా ప్రతి సోమవారం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. రూ.25వేల రెండు పూచీకత్తులు ఇవ్వాలని, జైలు నుంచి విడుదలయ్యాక సత్ప్రవర్తన సరిగా లేకపోతే వచ్చే ఫిర్యాదు మేరకు బెయిల్ రద్దు చేస్తామని కోర్టు హెచ్చరించింది. పరిటాల రవి 2005 జనవరి 24వ తేదీన ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. పార్టీ కార్యాలయం నుంచి బయటకు వస్తుండగా అతడిపై దాడిచేసి చంపివేశారు.

## వాయిదాలు, అంతరాయాలతో.. లోక్‌సభలో 65 గంటలు వృథా

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఉభయ సభల్లోనూ విలువైన సమయం వృథా అయ్యింది. లోక్‌సభ భారీ అంతరాయాలను ఎదుర్కొంది. మూడవ సెషన్‌లో 65 గంటలు, మొత్తం మూడు సెషన్‌లలో కలిపి 70 గంటలకు పైగా సమయాన్ని కోల్పోయింది. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడు విడతలుగా కొనసాగాయి. డిసెంబర్ 19న లోక్‌సభలో గొడవ, ప్రతిపక్ష ఎంపీల నిరసనల నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు ఆకస్మికంగా ముగిశాయి. శుక్రవారం ఉభయ సభలూ నిరవధికంగా వాయిదాపడ్డాయి.కాగా, అధికారిక సమాచారం ప్రకారం లోక్‌సభ మొదటి సెషన్‌లో 5 గంటల 37 నిమిషాలు వృథా అయ్యాయి. రెండవ సెషన్‌లో గంటా 53 నిమిషాలు, ముగింపు సెషన్‌లో ఆశ్చర్యకరంగా 65 గంటల 15 నిమిషాలు లోక్‌సభ కోల్పోయింది. లోక్‌సభ తొలి సెషన్‌లో ఏడు, రెండో సెషన్‌లో 15, మూడో సెషన్‌లో 20 సమావేశాలు జరిగాయి. తొలి సెషన్‌లో ఏడు గంటలు, రెండో సెషన్‌లో 33 గంటలకుపైగా, మూడో సెషన్‌లో 21.7 గంటలపాటు చర్చల్లో ఎంపీలు పాల్గొన్నారు. మరోవైపు రాజ్యసభ తొలి సెషన్‌లో 34.16 గంటల పాటు చర్చ జరిగింది. రెండో సెషన్‌లో చర్చా సమయం 115.21 గంటలకు పెరిగింది. అయితే మూడవ సెషన్‌లో చర్చల సమయం 62 గంటల కనిష్టస్థాయికి పడిపోయింది.



# విశాఖపట్నం సిటీ పోలీస్, అపోలో హాస్పిటల్స్ సంయుక్తంగా రోడ్డు ప్రమాద బాధితుల కోసం 'అంబులెన్స్ సేవలు' ప్రారంభం





ప్రజాస్వామ్యం న్యూస్ : విశాఖపట్నం : డిసెంబర్ 20 రోడ్డు ప్రమాద బాధితుల సహాయార్థం విశాఖపట్నం నగర పోలీసు శాఖ, అపోలో హాస్పిటల్స్ సంయుక్తంగా 'అంబులెన్స్ సేవలు' ప్రారంభించాయి. ఈ అంబులెన్స్ సేవలను అరిలోవ హెల్త్ సిటీలో ఉన్న అపోలో హాస్పిటల్స్ వద్ద నగర పోలీసు కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ శంక బ్రత బాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు అని దీనికి కారణం గాయాలు పాలైన బాధితులను హాస్పిటల్స్ కు చేర్చడంలో జాప్యమేనన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను హాస్పిటల్‌కు తీసుకెళ్ళడం అత్యవసరం అన్నారు. వెంటనే తీసుకెళ్లగలిగితే అమూల్యమైన ప్రాణాలను కాపాడగలుగుతామని చెప్పారు. ఒకవైపు ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. మరోవైపు ప్రమాదం జరిగిన వెంటనే వైద్య సహాయం అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. తద్వారా ప్రమాద మరణాల సంఖ్యను తగ్గించగలుగుతామని చెప్పారు. అపోలో హాస్పిటల్స్ కు ఒక అంబులెన్స్ కోసం విజ్ఞప్తి చేశానన్నారు. ఈ అంబులెన్స్ 24/7 బాధితులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అంబులెన్స్ లో ఒక పోలీసు ఉంటారన్నారు. ఆయన టోల్ ఫ్రీ కాల్స్ స్వీకరించి, అంబులెన్స్‌ను ప్రమాద ప్రదేశానికి చేరుకోవడానికి సహాయపడతారని తెలిపారు. మొదటి చికిత్సగా సీపీఆర్ తదితర అందించిన తర్వాత, బాధితుడిని అత్యవసర సహాయంతో సమీప ట్రామా కేర్ సెంటర్‌కి తరలిస్తారని చెప్పారు. అమూల్యమైన ప్రాణాలను కాపాడటమే ధ్యేయం అని అన్నారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీఓఓ రామచంద్ర మాట్లాడుతూ ఈ అంబులెన్స్ సేవలు భీమునిపట్నం, ఆనందపురం, పీఎం పాలెం, అరిలోవ, ఎంవీపీ కాలనీ, త్రీ టౌన్, టూ టౌన్, మహారాణిపేట, వన్ టౌన్, ద్వారకా బస్టాండ్, ఫోర్త్ టౌన్, కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, దువ్వాడ, స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయాన్ని అందజేస్తాయని తెలిపారు. ఈ అంబులెన్స్ సేవల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1066 ద్వారా సంప్రదించవచ్చున్నారు. గాయపడిన వ్యక్తులను సమీప హాస్పిటల్స్ కు తీసుకు వెళ్లనున్నారని చెప్పారు. అపోలో హాస్పిటల్స్(అరిలోవ, రామ్ నగర్), సెవెన్ హిల్స్, కేర్, మెడికోవర్, కేజీహెచ్, గీతం, గాయత్రి, క్వీన్స్ ఎన్ఆర్ఐ, అనిల్ నీరూ కొండ (ఏఎన్ఐటీఎస్), బెహరా, కిమ్స్ ఐకాన్, ఓమ్ని ఆర్కే, పినాకిల్, క్యూవన్, పవన్‌సాయి ట్రామా కేర్ సెంటర్స్ కు తరలించనున్నారని చెప్పారు. ఈ అపోలో హాస్పిటల్స్ అంబులెన్స్ సేవలు ఇప్పుడు 24/7 అందుబాటులో ఉంటాయని తెలిపారు. అపోలో హాస్పిటల్స్ అంబులెన్స్ ఆక్సిజన్ సిలిండర్, హార్ట్ మానిటరింగ్ సిస్టమ్‌తో కూడిన డిఫిబ్రిలేటర్, సక్షన్ యంత్రం, ఈసీజీ యంత్రం, శ్వాస సంబంధిత పరికరాలు, ఐవీ ద్రవాలు, ఔషధాలు, పరికరాలతో సిద్ధంగా ఉంటుందన్నారు. అత్యవసర చికిత్స కోసం వైద్య సిబ్బంది అంబులెన్స్ లో ఉండి సేవలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# తప్పిన పెను ప్రమాదం

ప్రజాస్వామ్యం న్యూస్ : గజపతినగరం : మండలంలోని మధుపాడ గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం ఒరిస్సా ఆర్టీసీ బస్సు అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకెళ్లింది. అయితే డ్రైవర్ వెంటనే అప్రమత్తం అవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 40 మంది ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విజయనగరం నుంచి జైపూర్ వెళ్తున్న ఒరిస్సా ఆర్టీసీ బస్సు మధుపాడ గ్రామ సమీపానికి వచ్చేసరికి అదుపుతప్పి తుప్పల్లోకి దూసుకుపోయింది. రోడ్డు పక్కన అంతా మైదాన ప్రాంతం కావడంతో డ్రైవర్ వెంటనే బస్సుని నిలుపుదల చేయగలిగాడు. కొన్ని గంటల తర్వాత బస్సును తుప్పల్లో నుంచి బయటికి తీసిన తర్వాత ప్రయాణికులతో ముందుకు సాగింది.



# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కి ఉపకార్ ట్రస్ట్ సౌండ్ సిస్టమ్, సిసి కెమెరాలు వితరణ

ప్రజాస్వామ్యం న్యూస్ : విశాఖపట్నం : డిసెంబర్ 20 విశాఖలోని ఆరిలోవ దరి హనుమంతువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఉపకార్ ట్రస్టు అధినేత, సినీ నిర్మాత, కళాభోజ, నిశ్వార్ధ సేవకులు డా.కంచర్ల అచ్యుతరావు సిసి కెమెరాలు, నూతన సౌండ్ సిస్టమ్ ను శుక్రవారం సమకూర్చారు. ట్రస్టు కార్యాలయ సిబ్బంది నాగు ఆధ్వర్యంలో వాటిని పోలీసులకు అందజేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో అవసరమైన సామాగ్రిని మార్పుచేయడానికి ట్రాఫిక్ పోలీసులు చేసిన అభ్యర్ధ మేరకు ఉపకార్ ట్రస్టు నుంచి వెంటనే వాటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా.కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు నిరాటంకంగా సేవలందించేందుకు ఉపకార్ ట్రస్టు ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ప్రజా, ప్రభుత్వ సేవలు ఇకపై కూడా కొనసాగుతాయన్నారు. అందునా ట్రాఫిక్ పోలీసులు ప్రయాణీకుల రక్షణ కోసం నిర్విరామంగా కృషి చేస్తూ విధులు నిర్వహిస్తారని కొనియాడారు. వారికి ఎప్పుడు ఏవిధమైన సహాయ సహకారాలు కావాలన్నా అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అదేవిధంగా



ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పోలీసు హెచ్చరికలు ప్రతీ ఒక్కరూ పాటించాలని కోరారు. పోలీసులు హెచ్చరికలు పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యం చేరడానికి ఆస్కారం వుంటుందన్నారు. తోటివారికి తమ వంతు సహాయం చేసే విషయంలో ప్రతీ ఒక్కరూ ముందు రావాలని ఈ సందర్భంగా డా.కంచర్ల అచ్యుతరావు పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించండి

నంద్యాల : గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే డెలివరీ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో గర్భిణీ స్త్రీలను వెనక్కి పంపకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పిహెచ్సి, సిహెచ్సి లలో వైద్య సేవలు మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. ఓపి సంఖ్య పెరగడంతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులుఉచితంగా పంపిణీ చేయాలన్నారు. మాతృ శిశు మరణాలు సున్నా స్థాయికి చేరుకునేలా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలలో పౌష్టికాహారాన్ని పెంచడంతోపాటు రక్తహీనతను అధిగమిచ్చేందుకు స్త్రీ శిశు సంక్షేమ అధికారులను సమన్వయ పరచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో ఎన్టీఆర్ వైద్య సేవలు మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గుండె సంబంధిత చికిత్సలు, ఇంజక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాలం చెల్లిన మందులు, ఇతర వృధా పరికరాలను టెండర్లు పిలిచి వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో ఝాఫ్రూళ్ల, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్డెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు.. : ముల్లి పావని జంగయ్య యాదవ్

తెలంగాణ బ్యూరో ప్రజాస్వామ్యం తెలంగాణ : ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని గుంటి గూడెంలో గల చర్చి లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఘట్కేసర్ మున్సిపాలిటీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు కీర్తనలు పాడుతూ యువతి, యువకులు ఆనందోత్సాహంతో నృత్యాలు చేసి అలరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన క్రైస్తవులు యేసును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారని అనంతరం క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ వార్డు సభ్యులు మీసాల సుధాకర్ , సల్లూరి నర్సింగ్ రావు ,



పాస్టర్లు, క్రైస్తవ సోదరులు, చిన్నారులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

## - అంబేద్కర్ కే కాదు దేశానికే అవమానం

## - ఘట్ కేసర్‌లో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం ,నేతల అరెస్ట్





తెలంగాణ బ్యూరో ప్రజాస్వామ్యం తెలంగాణ : బిజెపి కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ ను అవమానించడాన్ని నిరసిస్తూ తక్షణమే అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని ఘట్ కేసర్ మండల కేంద్రంలో కేవీపీఎస్ సీఐటీయూ, ఎన్‌పిఆర్‌డి సంఘాల ఆద్వర్యంలో శుక్రవారం అమిత్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దిష్టిబొమ్మ దగ్ధం చేయడాన్ని అడ్డుకున్న పోలీసులు నేతలను అరెస్ట్ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య ఎన్ సబితలు మాట్లాడుతూ అంబేద్కర్ ను అవమానిస్తే భారత రాజ్యాంగాన్ని అవమానించినట్టేనని అన్నారు. భారత రాజ్యాంగాన్ని అవమానిస్తే ఈ దేశాన్ని దేశ ప్రజలను అవమానించి నట్టేనని అన్నారు, అమిత్ షా వ్యాఖ్యలు దేశ ప్రజలను, భారత రాజ్యాంగమును అగౌరవ పరిచేలా ఉన్నాయని అన్నారు. అమిత్ షా కేంద్ర హెూంమంత్రిగా పార్లమెంటులో ఉండడానికి అలాగే తనకు నచ్చిన మతం గురించి మాట్లాడడానికి స్వేచ్ఛనిచ్చింది అంబేద్కర్ అని గుర్తు చేశారుఆయన రచించిన రాజ్యాంగమే ఆర్టికల్ 25 ప్రకారం70సార్లే కాదు700సార్లు ఆయన భగ్వన్నామ స్మరణ చేసుకోవచ్చన్నారు. దేశంలో పలు సందర్భాల్లో బిజెపి నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రత్యక్షంగా ప్రకటించడం దేశ విద్రోహ చర్యగా పరిగణించాలని అన్నారు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగా బిజెపి ప్రభుత్వం ఈ రకమైనటువంటి వాక్యాలు చేస్తుందన్నారు. ఒక గొప్ప సంఘ సంస్కర్త రాజ్యాంగ నిర్మాత అయినటువంటి అంబేద్కర్ గారిని ఒక ప్రజాస్వామ్య బద్ధమైన పదవిలో ఉండి కూడా విమర్శించడం సరైనది కాదన్నారు దీనికి వెంటనే అమిత్ షా తన పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షురాలు చిలుకమరి మహేశ్వరి,ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు కొయ్యడ చంద్రమోహన్ ట్రాన్స్ పోర్ట్ యూనియన్ కార్యదర్శి కడమంచి యాదగిరి కే శోభ కే శ్రీలత పాపయ్య రఘు సాయి తదితరులు పాల్గొన్నారు..

# కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా అంబేద్కర్ పై చేసిన అనుచిత వాక్యాలను బేషరతుగా ఉపసంహారించుకోవాలి.

## - సీపీఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్

కుత్బుల్లాపూర్ – ప్రజాస్వామ్యం : రాజ్యసభలో కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా ప్రతిపక్షాలు ప్రతి రోజు అంబేద్కర్, అంబేద్కర్ అనడం ప్యాషన్ అయిందని, పలు సార్లు భగవంతుని పేరు తలిస్తే ఏడు జన్మల దాక స్వర్గం ప్రాప్తి కలిగేదని అంబేద్కర్ ను కించపరిచే వాక్యాలను ఖండిస్తూ శుక్రవారం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ఆశీ. యాదయ్య ఆధ్వర్యంలో నిజాంపేట్ లోని ఏసీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్ షా అంబేద్కర్ పై చేసిన అనుచిత వాక్యాలకు వెతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యసభలలో బాబా సాహెబ్ అంబేద్కర్ ను కించపరిచే వాక్యాలు చేసిన కేంద్ర హెూమ్ మంత్రి భారత దేశ ప్రజలకు బేషరతుగా వెంటనే క్షేమాపణలు చెప్పాలని, అలాగే కేంద్ర ప్రభుత్వం వెంటనే అమిత్ షా ను మంత్రి మండలి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాబాసాహెబ్ రాజ్యాంగం ద్వారా అని హక్కులను కల్పించారని



గుర్తుచేశారు. రాజ్యాంగం రచించే సమయంలో మిగతా సభ్యులు రకరకాల నిబంధనలు పెడితే అంబేద్కర్ మాత్రం కులం, మతం, లింగ విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన హక్కు ఉండాలని ఓటు హక్కు కలిపించారు. ఈ కార్యక్రమంలో వాసు, మోహన్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు..

# క్రిస్మస్ సెలబ్రేషన్స్ వేడుకల్లో పాల్గొనాలని కొలన్ హన్మంత్ రెడ్డికి రాష్ట్ర మైనార్టీ ఇంచార్జి కోఆర్డినేటర్ కల్లోజి రవికుమార్, పృథ్వి లు

కుత్బుల్లాపూర్ – ప్రజాస్వామ్యం : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపలి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జీహెచ్ఎంసి పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలో జరగబోయే ఈనెల క్రిస్మస్ సెలబ్రేషన్స్ నిమిత్తమై డివిజన్ల వారిగా ఎంపిక చేసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిసి పాస్టర్లను అందజేసి సెలబ్రేషన్స్ కు ఆహ్వానించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ ఇంచార్జి కోఆర్డినేటర్ కల్లోజి రవికుమార్, పృథ్వీలు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ పాస్టర్స్ చైర్మన్ గోడి శేఖర్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022